క్లుప్తంగా

అంబాపురంలో సిమెంటు రోడ్ల నిర్మాణం



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని ఒకటో వార్డులో పల్లంగా ఉన్న ప్రాంతంలో రహదారులు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ భూమి పూజ చేసిన పనులకు రోడ్డు వేస్తున్నారు. పల్లె పండుగ కింద సిమెంటు రోడ్డుకు రూ.35 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు 7 లక్షల రూపాయలు కలిపి మొత్తం రూ.57 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ చెప్పారు.

ప్రజల అర్జీలను తక్షణమే పరిష్కరించాలి



అంబాపురం(విజయవాడరూరల్): రీ సర్వే గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య అధికారులకు సూచించారు. అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సీతయ్య అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. గ్రామ సభలో మ్యూటేషన్‌కు సంబంధించి 6 దరఖాస్తులు, పేర్ల మార్పు, కొలతలకు సబంధించినవి 3 దరఖాస్తులు వచ్చాయని మండల సర్వేయర్ ఎస్.జనార్ధనరావు తెలిపారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో రంగారావు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గంలో ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు వైద్య ఖర్చులకు రూ.11,97,411 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్, దోనేపూడి రవి, వెలగపూడి శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు



కంకిపాడు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో దీపావళి సందడి మొదలైంది. కంకిపాడు పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో లైసెన్స్ దారులు ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక దుకాణాలను ఏర్పాటుచేసుకుని బాణసంచా విక్రయాలను బుధవారం నుంచి ప్రారంభించారు. కంకిపాడులో 20, ఈడుపుగల్లు 1, చలివేంద్రపాలెం 1 చొప్పున బాణసంచా దుకాణాలను ఏర్పాటుచేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలని తహసీల్దార్ వి.భావన్నారాయణ ఆదేశించారు.

ఇసుకాసురులు

- యనమలకుదురులో ఇసుక దోపిడీ
- నిషేధ క్వారీలో యంత్రాలతో తవ్వకాలు
- నిత్యం 70 ట్రాక్టర్లతో ఇసుక తరలింపు
- టీడీపీ నేతలకే ఉచిత ఇసుక పథకం



నిషేధిత యనమలకుదురు క్వారీలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణా

పెనమలూరు: నిషేధిత యనమలకుదురు ఇసుక క్వారీలో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. టీడీపీ నాయకుల అండదండలతో విజయవాడకు కూతవేటు దూరంలో ఇసుకమాఫియా పేట్రేగిపోతున్నా.. అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తిచూడటంలేదు. ఇసుక మాఫియా ఇక్కడ్నుంచి భారీగా ఇసుకను తరలిస్తూ సొమ్ముచేసుకుంటుండగా, టీడీపీ నేతలు అక్రమార్కులకు సహకరిస్తూ ఇసుకను కాజేస్తుండటం గమనార్హం.

పొంచి ఉన్న ప్రమాదం..

కృష్ణానదిపై కనకదుర్గ వారధి నిర్మాణం పూర్తయిన తర్వాత దశాబ్దకాలం కిందట యనమలకుదురు క్వారీని ప్రభుత్వం నిషేధిత క్వారీగా ప్రకటించింది. అప్పట్నుంచి ఇక్కడ ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక యనమలకుదురు క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ ఇసుక అక్రమ తవ్వకాలతో కనకదుర్గ వారధితో పాటు యనమలకుదురు గ్రామానికి కూడా ప్రమాదం పొంచి ఉంది.

నేతలకే ఉచిత ఇసుక పథకం!

ఈ క్వారీ నుంచి నిత్యం 70 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను బహిరంగ మార్కెట్‌లో రూ.7 వేలకు అమ్ముతున్నారు. ఇలా ఇసుకను తరలిస్తున్న ప్రతి ట్రాక్టర్ కూడా రోజుకు ఒక ట్రిప్ ఇసుకను టీడీపీ బడానేతకు ముడుపుగా చెల్లిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ కూడా అయిన సదరు టీడీపీ బడా నేత తాను చేస్తున్న కాంట్రాక్టు పనులకు ఈ ఉచిత ఇసుక పథకాన్ని ఉపయోగించుకుంటుండటం గమనార్హం. యనమలకుదురుకు చెందిన మరో టీడీపీ నాయకుడు తాను నిర్మించే అపార్ట్‌మెంట్ పనులకు సైతం ఈ ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను ఉచితంగా పొందుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా యనమలకుదురు క్వారీ నుంచి సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను నేతలు సైతం సొమ్ముచేసుకుంటున్నారు. ఈ ఇసుక అక్రమరవాణాకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోతే బుడమేరు వరద సీన్ భవిష్యత్‌లో యనమలకుదురుకు తప్పదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నిషేధిత క్వారీ నుంచి యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

గొల్లపూడి కాల్వ గండ్లు పూడ్చాలని వినతి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రంగనాథ్‌బాబు

నున్న(విజయవాడరూరల్): వరదలతో గొల్లపూడి కాల్వకు పడిన గండ్లు పూడ్చాలని రైతులు వ్యవసాయ అధికారి బి.రంగనాథ్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. నున్న గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గొల్లపూడి కాల్వ గండ్లు పూడ్చి, దాళ్వా పంటలు సాగు చేసుకునేందుకు నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సమస్యను ఇరిగేషన్ అధికారులకు తెలియజేసి కాల్వ గండ్లు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఏఓ తెలిపారు. దాళ్వా సీజన్‌లో పండించిన పంటకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గత డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. నున్న గ్రామంలో 35 మంది రైతులకు ప్రభుత్వ సహాయం అందలేదని రైతులు తెలిపారు. స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలు, వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరారు. సమావేశంలో ఏఈఓ ఆర్.సురేష్, వీఏఏలు మౌనిక, హిమబిందు, వీహెచ్ఏ శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి



వర్క్ షాపునకు హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది

గన్నవరం: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్‌రాజు తెలిపారు. స్థానిక స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయంలో బుధవారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అంగన్‌వాడీ సిబ్బందికి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసై యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు వీటి బారినపడి చదువును దూరమవడంతో పాటు ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వ్యక్తులను డీ–ఎడిక్షన్ సెంటర్లకు పంపడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వల్ల జరుగుతున్న అనార్థాల గురించి వివరించారు. సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు పద్మాదేవి, నాగపద్మావతి, ధనలక్ష్మి, దుర్గాదేవి, బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి.విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

పొడ తెగులు నుంచి వరి పైరును సంరక్షించుకోవాలి

ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి



దావులూరులో రైతులకు సూచనలు చేస్తున్న సుధారాణి

కంకిపాడు: పొడ తెగులు నుంచి వరి పైరును సంరక్షించుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మండలంలోని దావులూరు గ్రామ పరిధిలోని వరి పొలాలను బుధవారం ఆమె సందర్శించారు. దోమ ఉధృతి తగ్గుముఖం పట్టిందని, వరి పొలాల్లో అక్కడక్కడా పొడ తెగులు ఉన్నట్లు గుర్తించారు. చిరు జల్లులతో కూడి వర్షాలు వల్ల పొడ తెగులు వ్యాప్తి చెందుతున్నట్లు సూచించారు. డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ వరి పైరులో యాజమాన్య చర్యలు సమర్థంగా తీసుకోవాలన్నారు. రసాయనాలతో కూడిన మిశ్రమాలను వాడవద్దని సూచించారు. హెక్సాకొనజోల్ లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు, లేదా వాలిడామైసిన్ లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పొడ తెగులు ఉధృతి అధికంగా ఉంటే నాటివో 0.4 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అధిక వర్షాలతో వరి పొలాల్లో చివరి కోటా కింద ఎరువుల్లో నత్రజని ఇచ్చే యూరియా లాంటి ఎరువులను ఆపి వేయాలని, లేకపోతే తగ్గించి చల్లుకోవాలని, అప్పుడే పంటకు మేలు చేకూరుతుందని తెలిపారు.

పాడి రైతులకు రూ.19.19 లక్షల బోనస్ పంపిణీ



పాల సొసైటీ కార్యదర్శులకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం శ్రమిస్తోందని ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 163 పాల సహకార సంఘాలకు మూడో విడత బోనస్‌గా రూ.19.19 లక్షలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ మొత్తాన్ని ఆయా సొసైటీ వేతన కార్యదర్శులకు ఆయన చెక్కుల రూపంలో అందించారు. లాభర్జన లేకుండా ఏటా నాలుగు దఫాలుగా పాడి రైతులకు బోనస్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ అందిస్తోందని చలసాని చెప్పారు. పాలకవర్గ సభ్యురాలు శనగల వెంకట శివజ్యోతి, ట్రస్ట్ డైరెక్టర్ పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాబూరావు సేవలు ప్రశంసనీయం



బాబూరావు దంపతులను సత్కరిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

గన్నవరం: గ్రంథాలయాల సేవలను ప్రజలకు చేరువ చేయడంలో దొండపాటి బాబూరావు కృషి ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ తెలిపారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో బుధవారం ప్రథమశ్రేణి గ్రంథాలయ ఇన్‌చార్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బాబూరావుకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయ శాఖలో బాబూరావు సుదీర్ఘకాలం సేవలందించారన్నారు. గుడివాడ, తేలప్రోలు, వీరవల్లి, గన్నవరం శాఖల్లో రికార్డు అసిస్టెంట్‌గా ప్రత్యేక గుర్తింపు సాధించారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంఈఓ కె.రవికుమార్, ఎంపీడీఓ స్వర్ణలత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు పాల్గొన్నారు.

రీ సర్వేపై అభ్యంతరాల స్వీకరణ



పెనమలూరులో మాట్లాడుతున్న డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామకృష్ణప్రసాద్

పెనమలూరు: గతంలో చేసిన రీ సర్వే పై భూయజమానులకు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామకృష్ణ ప్రసాద్ అన్నారు. పెనమలూరు గ్రామంలో బుధవారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో మండలంలోని పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, గ్రామాలలో భూముల రీ సర్వే చేశామన్నారు. అయితే సర్వేలో విస్తీరణ తగ్గినా, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయకపోయినా, పేర్లు తప్పుగా నమోదు చేసినా, ఆధార్ నంబర్ లింకు చేయక పోయినా, ఇతర పొరపాట్లు ఉంటే వెంటనే అభ్యంతరాలు తెలుపుతూ తమకు అర్జీ ఇవ్వాలని సూచించారు. సమస్యను తాము 15 రోజుల్లో పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ సభలో పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, రీసర్వే డీటీ అరుణ్, మండల సర్వేయర్ శివరామకృష్ణ, ఆర్ఐలు, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు. నవంబర్ 1వ తేదీన గంగూరులో ఉదయం 11 గంటలకు గ్రామసభ జరుగుతుందని చెప్పారు.

పాఠశాలల్లో దీపావళి శోభ



దీపావళి వేడుకల్లో విద్యార్థులు

ఉయ్యూరు: దీపావళి పండుగ సందడి నెలకొంది. ఉయ్యూరు పట్టణంలో వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణం వద్ద టపాసులు దుకాణాలు ఏర్పాటుచేయటంతో బుధవారం కొనుగోలుదారులతో సందడిగా మారింది. పూల దుకాణాలు, ప్రమిదలు, పూజా సామగ్రి విక్రయ కేంద్రాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. చిన్నారులు పండుగకు ఒక రోజు ముందే బాణాసంచా కాల్చుతూ సందడి చేస్తున్నారు. ఎంకే ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో దీపావళి వేడుకలు ఉత్సాహంగా జరిపారు. విద్యార్థులు టపాసులు పేల్చారు. పండుగ ఆవశ్యకతను పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు విద్యార్థులకు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: కానూరులో బుధవారం తెల్లవారుజామున విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన సింహాద్రి సత్యనారాయణ(65) స్థానిక శ్రీనివాసా కల్యాణ మండపంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతను వెలగపూడి కాంప్లెక్స్ వద్ద బందరు రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి బైక్‌పై అతి వేగంగా వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధుడిని ఢీ కొట్టారు. ఈ ఘటనలో వృద్ధుడి కాలు విరిగి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయమైంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని గమనించిన స్థానికులు అతనిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కంకిపాడు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ డి.తాతాచార్యులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన తుర్లపాటి కల్యాణ్ చక్రవర్తి(26) ఈనెల 24న ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితుడు కల్యాణ్ చక్రవర్తిని వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 29న మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం, మృతుడి తల్లి బేబీ ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాతాచార్యులు తెలిపారు.

పెనమలూరులో మహిళా ఓటర్లే అధికం

- మహిళా ఓటర్లు 1,52,509
- పురుషులు 1,42,258 మంది



పోరంకిలో ఓటర్లు(ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అధికారులు విడుదల చేసిన ఓటర్ల ముసాయిదాలో ఓటర్ల వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే గత ఎన్నికలు ముగిసిన తరువాత ఓటర్ల ముసాయిదాను ప్రకటించారు. పెనమలూరు నియోజకవర్గంలో గతంలో మొత్తం ఓటర్లు 2,94,928 మంది ఉండగా, తాజాగా విడుదల చేసిన ఓటర్లలో మొత్తం 2,94,769 మంది ఉన్నారు. ఓటర్లు 159 మంది తగ్గారు. అయితే ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. తాజా జాబితాలో ఉన్న మొత్తం ఓట్లు 2,94,769 మంది ఉండగా అందులో పురుషులు 1,42,258 మంది, మహిళా ఓటర్లు 1,52,509 మంది, ట్రాన్స్ జెండర్లు ఇద్దరు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 10,251మంది ఎక్కువగా ఉన్నారు. మహిళలే నిర్ణేతలుగా ఉన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ఓట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు

కాగా ఓటు హక్కు లేనివారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఇచ్చారు. నవంబర్ 28వ తేదీ వరకు ఓటుకు దరఖాస్తుతో పాటు అభ్యంతరాలు తెలుపవచ్చు. తుది ఓటర్ల జాబితాను జనవరి 6వ తేదీన ప్రకటిస్తారు. ఓటు దరఖాస్తు ఆన్‌లైన్, బీఎల్వోలు, ఆయా రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో స్వీకరిస్తారు.

ప్రాంతం	మొత్తం ఓటు	పురుషులు	స్త్రీలు	టీజీ
వైఎస్సార్ తాడిగడప	1,37,509	67,133	70,375	1
పెనమలూరు	39,091	18,665	20,426	–
కంకిపాడు	55,440	26,382	29,057	1
ఉయ్యూరు అర్బన్	32,789	15,779	17,010	–
ఉయ్యూరురూరల్	29,940	14,299	15,641	–
మొత్తం ఓట్లు	2,94,769	1,42,258	1,52,509	2

విధులు బహిష్కరించిన పారిశుద్ధ్య కార్మికులు



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

గన్నవరం: పారిశుద్ధ్య కార్మికుడిపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గన్నవరం గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విధులను బహిష్కరించిన పారిశుద్ధ్య కార్మికులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజా ఆరోగ్యం కోసం ఎండ, వాన లెక్కచేయకుండా నిరంతరం పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని చెప్పారు. అటువంటి కార్మికులపై విచక్షణ రహితంగా దాడులకు దిగడం దుర్మార్గమన్నారు. స్థానిక చింతలపేటలో పారిశుద్ధ్య కార్మికుడు తుమ్మి ఏసుబాబుపై దాడిచేసిన మహమ్మద్ షబ్బీర్ హుస్సేన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటి వరకు విధులు నిర్వహించమని కార్మికులు తేల్చి చెప్పారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న సమగ్రశిక్ష రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు తదితరులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన అండర్–14 నెట్‌బాల్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఎంపికలో బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. బాలుర అండర్–14 నెట్‌బాల్ జట్టుకు కొండా తిరుమల గోపిచంద్, షేక్ ఖాదర్ వలి, వలివెల మారుతీ మహేష్, పల్లపు సన్ని ఎంపిక కాగా, బాలికల అండర్–14 జట్టుకు పొలిమెట్ల వాసవి శిరీష, మల్లెల జ్యోతిక, గద్దల బ్యూలా ఎంపికైనట్లు హెచ్ఎం నాగేశ్వరరావు చెప్పారు. వచ్చే నెలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఈ విద్యార్థులు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావు అభినందించారు.